క్లుప్తంగా

సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలో కొనసాగుతున్న ఎంజాయ్‌మెంట్ సర్వేను అదనపు కలెక్టర్ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. తిమ్మయ్యపాలెం శివారులోని సర్వే నంబర్ 70లో కొనసాగుతున్న సర్వేను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. మండలంలో పదహేను రోజులుగా కాస్తు, కబ్జా ప్రకారం ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తూ, ఆయా గ్రామపంచాయతీల వద్ద నోటీస్ బోర్డులో ఉంచుతున్నామన్నారు. ఆ వివరాల్లో ఏమైన తప్పులు దొర్లితే సంబంధిత రెవెన్యూ బృందాల దృష్టికి తీసుకురావాలన్నారు. అధికారులకు రైతులు సహకరించాలని కోరారు. ఆయన వెంట సర్వే ఏడీ శ్రీనివాస్, మేరావత్ మునినాయక్, బుజ్జి రామారావు, సోమ, సీతా, దత్త, రాంబాబు, లక్ష్మా, సేవా, రాజశేఖర్ ఉన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న కాలనీవాసులు

మిర్యాలగూడ అర్బన్: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారానికి నిరసనగా పట్టణంలోని కృష్ణాకాలనీ వాసులు బుధవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రాణాలను రక్షించే మహిళా డాక్టర్‌పై సభ్యసమాజం తలవంచేలా అత్యాచారానికి పాల్పడి హత్య చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నంద్యాల కృపాకర్‌రెడ్డి, బంటుఖర్, మల్లారెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాదవి, శివకుమార్, రమణారెడ్డి పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

మిర్యాలగూడ: బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. ధర్నాకు బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, రుణమాఫీ కాని రైతులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నిబంధనలు పాటించాలి

మిర్యాలగూడ అర్బన్: వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రూరల్ ఎస్‌ఐ నరేష్ అన్నారు. ప్రయాణికులకు అంతరాయం కలిగిస్తున్న కొత్తగూడెం గ్రామంలోని బాబా రాందేవ్, రాజాస్థాని దాబా, హరిప్రియ హోటల్, జగన్ హోటల్, కిష్టాపురం గ్రామంలోని పార్థసాయి హోటల్, జాషువా టీ స్టాల్‌తో పాటు వెంకటాద్రిపాలెం చాయ్‌బాబు చాయ్ హనుమాన్ టీ స్టాల్ యజమానులను బుధవారం స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

హాలియా : ఉత్తమ అధికారిణిగా అవార్డు పొందిన అనుముల మండల తహసీల్దార్ జయశ్రీని మాజీ ఎంపీటీసీ గడ్డం జయమ్మ, రమణయ్య దంపతులు బుధవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. అనుముల మండలంలోని గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారిగా విధులు సక్రమంగా నిర్వహించినందుకు తహసీల్దార్ జయశ్రీకి ఉత్తమ అవార్డు వరించింది. కార్యక్రమంలో రాపోలు వాసు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న వడ్త్య రమేష్‌నాయక్

చందంపేట : మండలంలోని చిత్రియాల గ్రామంలో శ్రీ కంఠ మహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ, అంకాలమ్మజాతర బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు వడ్త్య రమేష్‌నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట బోయపల్లి రాములుగౌడ్, పాపయ్య, శంకర్, రామలింగం, వడ్త్య చైతన్య పాల్గొన్నారు.

అధికారులను సంప్రదించాలి

అడవిదేవులపల్లి : రుణమాఫీ కాని రైతులు నేరుగా వ్యవసాయ అధికారులను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారిణి గుర్రం సరిత కోరారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కుటుంబానికి రూ.2లక్షల వరకు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయని, లోన్ అకౌంట్ , ఆధార్ అనుసంధానం కాకపోయినా తదితర కారణాలతో రైతుల రుణ మాఫీ జరగకపోవచ్చని తెలిపారు.

వానరాలతో బెంబేలు !

- వణుకుతున్న జనాలు
- జనావాసాల్లో యథేచ్ఛగా సంచారం
- ఆహార అన్వేషణలో స్థానికులపై దాడులు



మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డికాలనీలో ఓ ఇంట్లో తిష్ట వేసిన కోతులు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో ప్రజలు కోతుల బెడదతో సతమతం అవుతున్నారు. నిత్యం అవి గుంపులు గుంపులుగా సంచరించడంతో పాటు ఇళ్లల్లోని ప్రహరీలపై గంటల తరబడి తిష్ట వేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆహారం కోసం ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఈ క్రమంలో వాటి ఆగడాలను అడ్డుకునేందుకు ప్రయత్నించే వారిపై దాడులకు తెగబడుతున్నాయి. చాలా కాలంగా ఈ సమస్య కొనసాగుతున్నప్పటికీ మున్సిపల్ యంత్రాంగం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఎక్కడెక్కడంటే..

మున్సిపాలిటీలో 48 వార్డులుండగా ప్రధానంగా రెడ్డికాలనీ, ముత్తిరెడ్డికుంట, అశోక్‌నగర్, రైల్వేస్టేషన్ రోడ్డు, రవీంద్రనగర్ కాలనీ, హౌజింగ్‌బోర్డు, విద్యానగర్, హనుమాన్‌పేట, చైతన్యనగర్, బంగారుగడ్డ, తాళ్లగడ్డ, సీతారాంపురం, కృష్ణాకాలనీ, కృష్ణమానస కాలనీ, నందిపాడు శివారు, రామచంద్రాగూడెం తదితర ప్రాంతాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. ఒక వైపు ఆహారం సరిగా దొరకపోవడంతో ఇళ్లల్లోకి జొరబడుగుతున్నాయి. మరో వైపు చెట్లు లేకపోవడంతో పట్టణాలకు వచ్చి చేరుతున్నాయి. ఎక్కడ కోతులున్నాయో అక్కడ చిన్నారులు, వృద్ధులు, మహిళలను బెదిరించడంతో పాటు కొన్ని సందర్భాల్లో పాదచారులు, వాహనదారులపైకి ఎగబడి కరుస్తున్నాయి.

అటవీశాఖ అనుమతులు తప్పని సరి

గతంలో కోతులను పట్టుకునేందుకు మున్సిపల్ శాఖతో ఒప్పందం చేసుకునే వారు. అనంతరం వాటిని ఒకే చోట ఉంచి సంరక్షించేవారు లేకుంటే తీసుకెళ్లి అటవీ ప్రాంతాల్లో వదిలి వేసేవారు. మర్కటాల సంఖ్య గతంలో 100 వరకు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య అన్ని వార్డుల్లో కలిపి 500లకు పైగానే ఉన్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు జిల్లా నుంచి తీసుకువచ్చి కోతులను పట్టి బోనులో వేసి అటవీ ప్రాంతాలకు తరలించే వారు. అయితే కోతులు పట్టించేందుకు ముందుగానే అటవీశాఖ అధికారులు తప్పని సరిగా అనుమతులను తీసుకోవాల్సి ఉంటుంది. ఈ వ్యవహారం వ్యయప్రయాసలతో కూడుకున్నది కావడంతో ప్రస్తుతం వాటిని పట్టడానికి ఎవరు కూడా ముందుకు రావడం లేదు. కేవలం బోనులను పెట్టి కోతులను పట్టుకోవాలని చూస్తున్నప్పటికీ ఫలితం ఉండటం లేదు.

దాడులకు తెగబడుతున్నాయి



పట్టణంలో విపరీతంగా కోతులు బెడద ఉంది. రోడ్లపై వెళ్తుంటే వెంబడిస్తున్నాయి. ఈ విషయాన్ని అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా వారి నుంచి స్పందన లేదు. ఇటీవల రెడ్డికాలనీలో రోడ్డుపై వెళ్తున్న ఓ చిన్నారి, వాహనదారుడిపై దాడికి ప్రయత్నం చేయగా సమీపంలోని వ్యక్తులు కర్రలతో వెంబడించడంతో పరారయ్యాయి. అధికారులు వీటిని పట్టి అడవిలో వదిలేయాలి.

– మేడి నవీన్, మిర్యాలగూడ

కోతుల బెడదను నియంత్రిస్తాం



మున్సిపాలిటీలో కోతుల బెడద విషయం ఇటీవలనే మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటాం. కోతుల బెడద అధికంగా ఉన్న ప్రాంతాల్లో బోనులను ఏర్పాటు చేయిస్తాం. పట్టుకున్న కోతులను అటవీ ప్రాంతంలో వదిలివేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

ఫీవర్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

- డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీఓ శ్రీనివాసరావు

గుర్రంపోడు, కొండమల్లేపల్లి : ఆరోగ్య సిబ్బంది జ్వర సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని డీఎంహెచ్‌ఓ పి.శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం ఆయన గుర్రంపోడు పీహెచ్‌సీని, కొండమల్లేపల్లి, పీహెచ్‌సీ, సబ్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొన్ని గృహాలను సందర్శించి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. కొండమల్లేపల్లి సబ్ సెంటర్ పక్కనే ఉన్న ఓ ఇంటి యజమానురాలితో వైద్య సిబ్బంది జ్వర సర్వే చేస్తున్నారా.. అని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయా చోట్ల మాట్లాడుతూ జ్వర సర్వే గురువారంతో ముగుస్తుందని, సర్వేకు సంబంధించిన పూర్తి వివరాలను రేపటిలోగా పంపించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేస రవి, వైద్యాధికారులు భవానీ చక్రవర్తి, ఉషారాణి, అనూష, సీహెచ్‌ఓ సుగుణాబాయి, సూపర్‌వైజర్ రాణి, ఫార్మాసిస్ట్ లక్ష్మయ్య, స్టాఫ్ నర్స్ అనసూయ, హరీష్ తదితరులున్నారు.

సమర్థవంతంగా నిర్వహించాలి

మిర్యాలగూడ : పట్టణంలో వైద్యారోగ్య, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీఓ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్ కోరారు. బుధవారం ఎన్‌ఎస్పీ క్యాంపులో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు ఆర్డీఓ నివాసానికి సర్వే నిమిత్తం వెళ్లగా సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అదే విధంగా పట్టణంలోని 29వ వార్డు బంగారుగడ్డలో మున్సిపల్ కమిషనర్ సర్వేను పరిశీలించారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే

హాలియా : అనుముల మండలంలోని అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుజాత తెలిపారు. మండలంలోని పేరూర్‌లో నిర్వహిస్తున్న ఇంటింటి ఫీవర్ సర్వేను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫీవర్ సర్వేలో భాగంగా ఇంట్లో ఎవరికైనా జ్వరం, డెంగీ, మలేరియా,టైఫాయిడ్‌లాంటి అనారోగ్యాలు ఉన్నాయా? అని తెలుసుకోవడంతో పాటు వారికి ముందస్తుగా వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారన్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

అడవిదేవులపల్లి : ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కరుణాకర్‌రావు అన్నారు. బుధవారం అడవిదేవులపల్లిలో జరుగుతున్న ఫీవర్ సర్వేను డాక్టర్ రామాంజనేయులుతో కలిసి పరిశీలించారు. ప్రజలను జ్వరాలపై అడిగి తెలుసుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్‌ను పరిశీలించారు. వారి వెం ఎంపీఓ మోహసిన్ బిన్ అహ్మ, దుర్గయ్య, ఉమమహేశ్వర్ ఉన్నారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలి

అడవిదేవులపల్లి మండలంలో గ్రామ కార్యదర్శులు టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంటు ఎంపీడీవో కరుణాకర్‌రావు సమావేశం అయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో సిజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపర్చాలని కోరారు.

డిండి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నింపాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

డిండి: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా డిండి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నింపి ఆయకట్టుకు సాగునీటిని అందించాలని బుధవారం బీజేపీ నాయకులు స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది వానాకాలం సాగులో భాగంగా డిండి ప్రాజెక్టు ఆయకట్టు కింద సాగు చేసిన వరి పంట చేతికొచ్చే సరికి దాదాపు 2 నెలల సమయం పడుతుందని తెలిపారు. ప్రాజెక్టులో ప్రస్తుతం పది రోజులకు సరిపడే నీరు మాత్రమే ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రాజెక్టులోకి నీటిని తీసుకొచ్చే విషయంపై జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేసారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నరసింహారావు,గిరిజన మోర్చా అసెంబ్లీ కన్వీనర్ భిక్షపతి,డిండి పట్టణ అధ్యక్షుడు గాయాల రాఘవేందర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు సాయి కుమార్, నరేష్, సురేష్, అమృత్, గెల్వయ్య, సైదులు, తిర్పతయ్య తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

పింఛన్‌దారుల హామీని అమలుచేయాలి

త్రిపురారం : ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొమ్ము హరికుమార్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో్లో వికలాంగుల హక్కుల పోరాట సమితి కమిటీ సభ్యులు, వికలాంగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల కన్వీనర్ ఖాసీం, ఆదినారాయణ రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు

దేవరకొండ: విధి నిర్వహణలో ఉద్యోగులు అంకిత భావంతో పని చేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లయ్య అన్నారు. కళాశాలలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు బదిలీపై వెళ్తుండడంతో బుధవారం వారిని కళాశాల అధ్యాపక బృందం సత్కరించింది. కార్యక్రమంలో అధ్యాపకులు సాయిలు, వెంకటేశ్వర్లు, రాజు, శ్రీను, శ్రీదేవి, నవత, అమీనపర్వీన్, జయప్రకాష్ ఉన్నారు.

అక్రమాలపై చర్య తీసుకోవాలి

త్రిపురారం : నిడమనూరు మండలంలోని వెనిగండ్ల ప్రాథమిక సహకారం సంఘం నిర్వహణలో అక్రమాలు జరుగుతున్నాయని అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను కోరారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన రుణ మాఫీలో రైతుల నుంచి అడ్డగోలుగా వడ్డీ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కందుకూరి కోటేష్, గురువయ్య, కుంచెం శేఖర్, తోటపల్లి బాలనారాయణ, చరణ్, రాజు, పుల్లయ్య పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

దేవరకొండ: కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని డిండి చౌరస్తా నుంచి డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, భిక్షపతి, అక్బర్, మల్లేష్, తదితరులు ఉన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

డిండి: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలేష్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రెండేళ్లుగా రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

బదిలీలు పీఆర్‌టీయూతోనే సాధ్యం

గుర్రంపోడు : మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు పీఆర్‌టీయూతోనే సాధ్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో పీఆర్‌టీయూ సభ్యత్వాలు అందించిన సందర్భంగా మాట్లాడారు. కోర్టు కేసుల కారణంగా మోడల్ స్కూల్ టీచర్లకు బదిలీలు, ప్రమోషన్‌లు అమలులో జాప్యం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కాళం నారాయణరెడ్డి, తరి రాము, నాంపల్లి శ్రవణ్‌కుమార్, ంబోయపల్లి రమేష్, అద్దంకి సునీల్, గౌస్‌మొయినుద్దీన్, భద్రారెడ్డి, సీతారామరాజు పాల్గొన్నారు.

డ్యాన్స్ మాస్టర్లు ఐకమత్యంగా ఉండాలి

మిర్యాలగూడ అర్బన్: జిల్లాలో పని చేస్తున్న డాన్స్ మాస్టర్లందరూ ఐకమత్యంగా ఉండాలని తెలంగాణ డాన్స్ స్పోర్ట్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు పాతనబోయిన శేఖర్ అన్నారు. పట్టణంలోని కళాభారతి ఆడిటోరియం ఆవరణలో బుధవారం నిర్వహించిన తెలంగాణ డాన్స్ స్పోర్ట్స్ అసోషియేషన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలో జిల్లా కమిటీ సభ్యులకు అసోషియేషన్ ద్వారా ఐడీ కార్డులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా డాన్స్‌మాస్టర్ అలుగుబెల్లి వెంకట్, రాము, పవన్, వీరు, బాబీ, రాహుల్, సైదులు తదితరులున్నారు.

ఒకేచోట కార్యాలయాలు నిర్మించాలి

మిర్యాలగూడ అర్బన్: నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఓకే చోట ప్రభుత్వమే క్యార్యాలయాలు నిర్మించాలని మట్టిమనిషి వేనేపల్లి పాండురాంగారావు అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత తెలుగుదేశం, టీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంతోకి రాగానే ఎంపీ ,ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇతర ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నారని, తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఇదే జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పోరాటాల ఫలితంగా ఎమ్మెల్యేలకు క్వార్టర్లు వచ్చాయని తెలిపారు. ఎమ్మెల్సీ, ఎంపీలకు కూడా కార్యాలయాలు కట్టి వారు దిగిపోగానే ఖాళీ చేసేలా చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములు కాపాడాలని కోరారు. ఆయన వెంట లొడంగి సైదులు, మట్టపల్లి వెంకన్న, శ్రీను తదితరులు ఉన్నారు.

ఏఐఎస్ఎఫ్ జెండా విద్యార్థులకు అండ

చింతపల్లి : ఏఐఎస్ఎఫ్ జెండా విద్యార్థులకు అండ అని ఆ సంఘం మండల అధ్యక్షుడు వలమాల ఆంజనేయులు అన్నారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవం సందర్భంగా చింతపల్లి మండల కేంద్రంలో సంఘం మండల సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పతకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం అయన మాట్లాడుతూ త్యాగాలు, పోరాటాలే ధ్యేయంగా ఏఐఎస్ఎఫ్ పనిచేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి షేక్ శంశోద్దీన్,చింతపల్లి మండల అధ్యక్ష,కార్యదర్శులు వలపోజు శివ, కాటేపాక మహేష్,నాయకులు ఎండి జావీద్,ప్రవీణ్, నవాజ్, అనస్ ఆఫన్, విజయ్, శివశంకర్, వరప్రసాద్, శివ, సిద్ధు, రవి, జయ, మానస,అక్షయ, శిరీష,ఉమామహేష్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యం

- సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి



హాలియాలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

హాలియా : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. పీఎం శ్రీ స్కీమ్‌లో భాగంగా హాలియా ఉన్నత పాఠశాలలో సుమారు రూ. 27లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి వారికి పదోన్నతులు, బదిలీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండా కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమానరేందర్‌రెడ్డి, కాకునూరి నారాయణ గౌడ్, మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, గౌనీ రాజారమేష్ యాదవ్, కౌన్సిలర్ సుధారాణి, వెంపటి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, నిర్మటి వెంకట్రామ్‌రెడ్డి, కుందూరు రాజేందర్‌రెడ్డి, చల్లా మట్టారెడ్డి, కాంట్రాక్టర్ మజర్ తదితరులు ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

గుర్రంపోడు : రహదారుల అభివృద్ధితో రవాణా సౌకర్యం మెరుగవుతుందని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నల్లగొండ– దేవరకొండ ప్రధాన రహదారి క్రాస్‌రోడ్డు నుంచి వెల్మగూడెం వరకు సెంట్రల్ రిలీఫ్ ఫండ్ నిధులు రూ.16కోట్లతో చేపట్టనున్న డబుల్ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్, కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, సూదిని జగదీశ్వర్ రెడ్డి, జాల చినసత్తయ్య యాదవ్, రాధాకృష్ణ పంతులు, జగదీశ్వర్‌రెడ్డి, అమరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే బాలునాయక్



గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ: అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు.బుధవారం పట్టణంలోని ఆయన నివాసం వద్ద మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులకు గుర్తింపు కార్డులను అందజేసి మాట్లాడారు.మత్స్య కార్మికుల అభివృద్ధికి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మత్స్యకారులు ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు,సహకార సంఘం సభ్యులు,తదితరులున్నారు.

యాదయ్య మృతికి సంతాపం

చింతపల్లి: మండల పరిధిలోని పోలేపల్లి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మునుకుంట్ల శేఖర్ గౌడ్ తండ్రి మునుకుంట్ల యాదయ్య గౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న దేవరకొండ శాసనసభ్యుడు నేనావత్ బాలునాయక్ ప్రగాఢ సంతాపం తెలిపారు. గ్రామంలో మునుకుంట్ల యాదయ్య భౌతిక కాయానికి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగభూషణం, మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అంగిరేకుల గోవర్ధన్, మాస భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



బకల్‌వాడీ పాఠశాలలో టాయ్‌లెట్స్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని బకల్‌వాడీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధుల ద్వారా నిర్మించిన టాయ్‌లెట్స్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా టాయ్‌లెట్స్, తాగునీటి వసతి కల్పించడతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలా జీనాయక్, ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

లిఫ్ట్ ద్వారా నీటి విడుదల

అడవిదేవులపల్లి, వీర్లపాలెం, ముదిమాణిక్యం, బాలెంపల్లి గ్రామాలకు వచ్చే నీటిని దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామంలో బుధవారం లిఫ్టు ద్వారా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లిఫ్ట్ ద్వారా వచ్చే నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

మురుగుకాల్వల్లో పూడిక తీయాలి

మిర్యాలగూడ : పట్టణంలోని మురుగుకాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ కోరారు. బుధవారం పట్టణంలోని సీతారాపురం మురుగుకాల్వలో పేరుకుపోయిన పూడికను ఆయన పరిశీలించి మాట్లాడారు. పట్టణంలోని మురుగుకాల్వల్లో ఏడాదిగా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో చెత్తాచెదారం, కంపచెట్లు, వ్యర్థాలతో నిండి దోమలు, ఈగలు వృద్ధి చెంది, పందులు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. దీంతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని ఆయన తెలిపారు. పూడికతీత పనులకు 50రోజుల కిందటే కౌన్సిల్ తీర్మానం చేసినప్పటికీ ఇప్పటివరకు టెండర్లు పిలవకపోవడంతో నిలిచిపోయాయన్నారు. కార్యక్రమంలో బావండ్ల పాండు, రవినాయక్, గుంటోజు వీరాచారి, విష్ణు, సైదులు, రఫి, బాబా, సీనియర్ జర్నలిస్టు అయూబ్ తదితరులు ఉన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న కమిషనర్ యూసుఫ్

మిర్యాలగూడ: పట్టణంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణను ఆయా వార్డుల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎండి.యూసుఫ్ రవీంద్రనగర్, బంగారుగడ్డ, హౌసింగ్‌బోర్డు కాలనీల్లో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న స్థలాల వద్దకు వెళ్లి పత్రాలను పరిశీలించారు. నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నా రు. కార్యక్రమంలో టీపీఎస్ అంజయ్య, ఏఆర్‌ఐ సత్యనారాయణ, వార్డు ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు బాధాకరం

- మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన
- అంబేద్కర్ విగ్రహాలకు నివాళి



హాలియాలో ర్యాలీ నిర్వహిస్తున్న మాలమహానాడు నాయకులు



మిర్యాలడగూలో ర్యాలీ నిర్వహిస్తున్న మాలమహానాడు నాయకులు

హాలియా : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ విషయంలో రాష్ట్రాలకు అధికారాన్ని ఇస్తూ సుప్రీంకోర్టు జడ్జీలు ఇచ్చిన తీర్పు బాధాకరమని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ మాలమహానాడు సంఘం నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తలపెట్టిన బంద్ హాలియాలో బుధవారం ప్రశాంతంగా ముగిసింది. బంద్ సందర్భంగా ఆ సంఘం నాయకులు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు లకమల మధుబాబు, నామ లింగయ్య, మోటమర్రి వెంకటేశ్వర్లు, లక్కాల లింగయ్య, మోటమర్రి సురేందర్, పాండు, జంగాల లక్ష్మమ్మ, గండమాల జానయ్య, రువ్వ వెంకటయ్య, పాన్‌షాపు వెంకటయ్య, బూరుగు వెంకటయ్య, పులిమామిడి వెంకటేశ్వర్లు ఉన్నారు.

మాలమహానాడు బంద్ ప్రశాంతం

మిర్యాలగూడ అర్బన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ రిజర్వేషన్ బచావో సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా జరిగింది. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి ఆధ్వర్యంలో మిర్యాలగూడలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలు గాజుల పున్నమ్మ, నగేష్, నాగటి జోషెఫ్, కోడిరెక్క చిన్నప్ప, సైదులు, మర్రి జోజి, వెంకన్న, శోభ, చైతన్య, శేఖర్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జాతీయ పోరాట సమితి పిలుపు మేరకు చేపట్టిన బంద్ దామరచర్లలో బుధవారం ప్రశాంతంగా ముగిసింది. పలువురు నాయకులు మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బైరం నర్సయ్య, తాళ్లపల్లి విజయ్, బైరం దయానంద్, సుదర్శన్, బాలగురవయ్య, బైరం గోపి, శ్రీను, రవీందర్, వంశీ పాల్గొన్నారు.

త్రిపురారం : ఎస్సీ, ఎస్టీ కులాల వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి కన్వీనర్, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కామర్ల జానయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ వర్గీకరణ సుప్రీం తీర్పును నిరసిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో ఆ సంఘం సభ్యులతో కలిసి త్రిపురారంలో ర్యాలీ నిర్వహిచారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి రాజు, ఎలక్షన్ రావు, కొల్లి కరుణాకర్, కొల్లి సురేష్, కలుముల వెంకటయ్య, కొల్లి నర్సయ్య, దాసు, నరేష్ పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం నందికొండ మున్సిపాలిటీలో బంద్ విజయవంతమయ్యింది. ప్రభుత్వ,ప్రైవేట్ విద్యా సంస్థలు, కార్యాలయాలు, వ్యాపార సముదాయాలు మూసివేశారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర నాయకులు గుంటి కోటేశ్వర్‌రావు, జగడం బాలాజీరావు, బత్తుల ప్రకాశ్, భూపతి, ఆనంద్ పాల్, బాలకుమార్, రవి, నాగేందర్, కోరే ప్రేమ్, రాజ్‌కుమార్, రాంప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతపల్లి: మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా చేపట్టిన భారత్ బంద్ బుధవారం మండలంలోని విజయవంతంగా ముగిసింది. మండల కేంద్రంలో పాటు మాల్ వెంకటేశ్వర్ నగర్,కురుమేడు ప్రధాన కూడలిలోని ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను మూసివేశారు. మాల మహానాడు నాయకులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సదానందం,బండి కార్తీకు, బండి సైదులు,నల్లవెల్లి సైదులు,ఆనంద్,లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.